క్లుప్తంగా

ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడిగా శ్రీరాములు


డాక్టర్ డి.శ్రీరాములు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం కర్నూలు మెడికల్ కాలేజి బ్రాంచ్ అధ్యక్షుడిగా డాక్టర్ డి.శ్రీ రాములు (జనరల్ మెడసిన్) ఎన్నికయ్యారు. అధ్యక్ష పోస్టు మినహా మిగిలిన పోస్టులన్నీ ఏక గ్రీవమయ్యాయి. శనివారం కళాశాలలోని క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో ప్రభుత్వ వైద్యుల సంఘానికి ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్ష పోస్టుకు డాక్టర్ డి. శ్రీరాములు, డాక్టర్ బ్రహ్మాజీమాస్టర్ పోటీ పడ్డారు. కౌంటింగ్‌లో అధ్యక్షుడిగా డాక్టర్ డి. శ్రీరాములు నాలుగు ఓట్ల తేడాతో గెలుపొందారు. కార్యదర్శిగా డాక్టర్ కేటీ విజయమోహన్‌రెడ్డి, ట్రెజరర్‌గా డాక్టర్ డి. శ్రీనివాసులు, జనరల్ కౌన్సిల్ మెంబర్లుగా డాక్టర్ డి. విజయానందబాబు, డాక్టర్ కె. మాధవీశ్యామల, డాక్టర్ కె. సోమప్ప, ఉపాధ్యక్షులుగా డాక్టర్ జె. జయరామ్, డాక్టర్ ఎస్. నాగేశ్వరయ్య, డాక్టర్ ఎం. మల్లికార్జున, జాయింట్ సెక్రటరీలుగా డాక్టర్ ఎం. ఉమాదేవి, డాక్టర్ ఐ. బాలసారయ్య, డాక్టర్ ఎ. శారద, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా డాక్టర్ వైకేసీ రంగయ్య, డాక్టర్ టీసీహెచ్ వెంకటరమణ, డాక్టర్ జి. విశాల, డాక్టర్ కె. సునీల్‌కుమార్, డాక్టర్ వై. మురళీప్రభాకర్, డాక్టర్ బి. హేమనళిని ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా డాక్టర్ ఎస్. వెంకటరమణ వ్యవహరించారు.

జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా శివమోహన్‌రెడ్డి


నియామక ఉత్తర్వులను అందుకుంటున్న శివమోహన్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా ఎ.శివమోహన్‌రెడ్డిని నియమించారు. ఈమేరకు శనివారం ఆయనకు డీఎస్‌ఓ ఆచార్యులు నియామక ఉత్తర్వులు తన కార్యాలయంలో అందజేశారు. కాగా, శివమోహన్‌రెడ్డి 30 సంవత్సరాలుగా వినియోగదారుల హక్కుల కోసం ఉద్యమిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎన్నో అవార్డులు పొందారు. ప్రస్తుతం ఆయన వినియోగదారుల రక్షణ మండలి జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

తినుబండారాల తయారీ కేంద్రాల్లో తనిఖీలు

కర్నూలు(హాస్పిటల్): వాడిన నూనెతో పాటు నకిలీ, కల్తీ నూనెలతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్న వ్యాపార కేంద్రాలపై శనివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఆహార నియంత్రణ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. ఆదోనితో పాటు కర్నూలులోని ఫుడ్ ప్యారడైజ్ హోటల్, సెంట్రల్ ప్లాజా ఎదురుగా ఉండే మొబైల్ క్యాంటీన్‌లలో ఆహార పదార్థాల తయారీని పరిశీలించారు. కల్తీతో పాటు నాణ్యతలేని వంటనూనెలతో పదార్థాలు తయారు చేస్తున్నారని అధికారులు తమ పరిశోధనలో గుర్తించారు. ఈ మేరకు వారికి జరిమానా విధించి కేసులు నమోదు చేశారు. తనిఖీలో ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన గ్రిల్ ఏర్పాటు


గ్రిల్ ఏర్పాటు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కర్నూలు (టౌన్) : క్రిష్ణనగర్ అండర్ బ్రిడ్జి వద్ద రాకపోకలకు ఇబ్బంది లేకుండా నూతన గ్రిల్‌ను ఏర్పాటు చేశారు. ఇదివరకు ఉన్న గ్రిల్ దెబ్బతినింది. ఈ విషయాన్ని 26 వ వార్డు కార్పొరేటర్ దండు లక్ష్మీకాంతారెడ్డి మునిసిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ భాను ప్రతాప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి దెబ్బతిన్న గ్రిల్ స్థానంలో రూ.1.20 లక్షలతో కొత్తది ఏర్పాటు చేశారు.

మాతృమూర్తే దిక్సూచి

కర్నూలు కల్చరల్: సనాతన హిందూ కుటుంబానికి మాతృమూర్తే దిక్సూచి అని విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ అన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు గత నెల 29వ తేదీ నుంచి జిల్లాలో సత్సంఘ దర్శన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. శనివారం స్థానిక సద్గురు త్యాగరాజ సీతారామాలయంలో అభయాంజనేయ స్వామి ప్రఖండ పరిధిలో మాతృశక్తి సత్సంగం జరిగింది. కార్యక్రమంలో మాతృశక్తి కన్వీనర్ భార్గవి పాల్గొన్నారు.

కఠిన చర్యలు తీసుకోవాలి

కర్నూలు (న్యూటౌన్): పొన్నకల్ గ్రామానికి చెందిన కురువ చిన్నరాముడుపై హత్యాయత్నానికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కురువ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కురువ చిన్నరాముడును వారు పరామర్శించి మాట్లాడారు. సంఘం నాయకులు కృష్ణ, తిరుపాల్, తవుడు శ్రీనివాసులు, కేసీ నాగన్న, చిన్న గిడ్డయ్య, అయ్యన్న పరామర్శించిన వారిలో ఉన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

- జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి
- నగర మేయర్ బీవై రామయ్య
- 50 , 110 వ సచివాలయాల్లో వైద్య శిబిరాల నిర్వహణ
- సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన ప్రజలు


శిబిరంలో అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీస్తున్న మేయర్ బీవై రామయ్య


బాబా బృందావన్ నగర్‌లో చెకప్ చేస్తున్న డాక్టర్

కర్నూలు (టౌన్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇస్తున్నారని నగర మేయర్ బీవై.రామయ్య అన్నారు. శనివారం స్థానిక 50 వ సచివాలయం పరిధిలోని గణేష్‌నగర్ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో, 110 సచివాలయ పరిధిలోని బాబా బృందావన్ నగర్ పార్కులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. మేయర్ ఆయా శిబిరాలను ప్రారంభించి అక్కడకు వచ్చిన రోగులు, కాలనీ వాసులతో మాట్లాడారు. వైద్యంతో పాటు ఉచితంగా మందులు ఇస్తున్నారా...అని అడిగి తెలుసుకున్నారు. నిరు పేదలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు వరమన్నారు. 45 రోజులు పాటు జరిగే ఈ శిబిరాల్లో ప్రజలకు ఆరోగ్య, కంటి పరీక్షలతో పాటు అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ కాశిరెడ్డి శ్వేతా, నందిని, పార్టీ నాయకులు ఆదిమోహన్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, రాష్ట్ర వీర శైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అన్ని పరీక్షలు చేయించుకున్నాను



మా ఇంటి సమీపంలోనే వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అన్ని ఆరోగ్య పరీక్షలు చేశారు. మందులు ఇచ్చారు. ఈ వయస్సులో చిన్న పాటి జబ్బులకు ఆసుపత్రికి వెళ్లలేని పరిస్థితి. ఇప్పుడు ఇక్కడికే డాక్టర్లు వచ్చి ఆరోగ్య పరీక్షలు చేశారు. చాలా సంతోషం. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్య సేవలు అందించడం గతంలో ఎన్నడూ లేదు. మాలాంటి వారి కోసం ప్రభుత్వం మంచి పని చేస్తుంది.

– సాలమ్మ, గణేష్‌నగర్

ప్రభుత్వానికి కృతజ్ఞతలు



నాకు 60 సంవత్సరాలున్నాయి. కంటి చూపు కొంత తగ్గింది. రాత్రి వేళ కనిపించేది కాదు. మా ఏరియాలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలియడంతో వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నా. డాక్టర్లు మందుల కిట్టు ఇచ్చారు. కంటి అద్దాలు కూడా ఇస్తామన్నారు. పైసా తీసుకోకుండా ఉచితంగా అన్ని ఇస్తున్నారు. ప్రభుత్వానికి నా కృతజ్ఞతలు.

– నాగేంద్రమ్మ

చాలా మంచి కార్యక్రమం



జగనన్న ఆరోగ్య సురక్ష చాలా మంచి కార్యక్రమం. నేను వైద్య శిబిరంలో అన్ని పరీక్షలు చేయించుకున్నా. బయట చేయించుకోవాలంటే వేలాదిరూపాయలు కావాలి. ఇక్కడ రూపాయి తీసుకోకుండా వైద్యులు అన్ని పరీక్షలు చేశారు. మందులు ఇచ్చారు. మా ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టిన ప్రభుత్వాలను గతంలో ఎప్పుడూ చూడలేదు.

– సుమలత, నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీ

11న మైనారిటీ దినోత్సవం

కర్నూలు (న్యూటౌన్): భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీ మైనారిటీ సంక్షేమ దినోత్సవం నిర్వహిస్తున్నారు. శనివారం జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి సయీద సబిహా పర్వీన్ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మైనార్టీ దినోత్సవం సందర్భంగా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రపై ఈనెల 7వ తేదీన వ్యాసరచన, వక్తృత్వ పోటీలను మాధ్యమిక, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలో వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గడియారం ఆసుపత్రి పక్కన ఉన్న ప్రభుత్వ మైనారిటీ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సెల్: 94417 61206కు సంప్రదించి పేరు రిజిస్టర్ చేయించుకోవాలని కోరారు. పోటీల్లో గెలుపొందిన వారికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేయనున్నట్లు వెల్లడించారు.

సురక్షిత ప్రయాణాలపై దృష్టి పెట్టండి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రయాణికులను సురక్షితంగా గమ్యానికి చేర్చడంపై దృష్టి సారించాలని రోడ్డు రవాణా సంస్థ కర్నూలు–2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ సూచించారు. శనివారం ఆయన స్థానిక డిపో గ్యారేజీ వద్ద డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డ్రైవర్ ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి


చిన్నారికి టీకా వేస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులు, చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం స్థానిక జొహరాపురం యూపీహెచ్‌సీ పరిధిలోని ఇందిరమ్మ హౌసెస్ అంగన్‌వాడీ కేంద్రంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పక ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యు విన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. దీనివల్ల పిల్లలను వ్యాధుల బారిన పడకుండా కాపాడవచ్చన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆరోగ్యసేవల గురించి వారితో మాట్లాడి వారికి మాతాశిశు సంరక్షణ సేవల గురించి వివరించారు. గర్భిణులకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్–ఎ సిరప్‌లు పంపిణీ చేశారు.

అవీ-ఇవీ

యువత పోరాటాలకు సిద్ధం కావాలి

కర్నూలు(సెంట్రల్): దేశంలో పెరిగిపోతున్న మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసేందుకు సిద్ధం కావాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి ఎస్.హుస్సేన్ పిలుపునిచ్చారు. శనివారం 32వ వార్డు పరిధిలోని ముజఫర్‌నగర్‌లో డీవైఎఫ్ఐ జెండాను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దినేష్, విజయ్ పాల్గొన్నారు.

27,28 తేదీల్లో మహాధర్నా

కర్నూలు(సెంట్రల్) : రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో మహా ధర్నా చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి డి.అంజిబాబు తెలిపారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో ఆయన మాట్లాడుతూ..48 గంటల పాటు మహాధర్నా సాగుతుందన్నారు.

7,8 తేదీల్లో సీపీఐ జిల్లా సమితి సమావేశాలు

కర్నూలు(సెంట్రల్) : నవంబర్ 7,8 తేదీల్లో సీపీఐ జిల్లా సమితి సమావేశాలను సీఆర్ భవన్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశాలకు రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య హాజరు కానున్నట్లు చెప్పారు.

19న దాక్టర్జీ స్ఫూర్తి మందిరం ప్రారంభం

కర్నూలు కల్చరల్: వికాస భారతి ఆధ్వర్యంలో ఓర్వకల్ మండలం కాల్వబుగ్గ సమీపంలోని సుభిగోశాల ప్రాంగణంలో డాక్టర్జీ స్ఫూర్తి మందిరాన్ని ఈనెల 19వ తేదీ ఉదయం 10.30 గంటలకు ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దళితులపై దాడులను ఖండించాలి

కర్నూలు(సెంట్రల్) : దళితులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి సి.మహేష్ డిమాండ్ చేశారు. శనివారం డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఎన్‌టీఆర్ జిల్లా కంచికచర్లలో దళితులపై దాడి జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్ర, నల్లన్న, విజయ, మహేష్, నాగరాజు, నరేష్ పాల్గొన్నారు.

7న కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతు గర్జన ర్యాలీ

కర్నూలు(సెంట్రల్): ఉమ్మడి జిల్లాలోని 54 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని కోరుతూ నవంబర్ 7వ తేదీన కాంగ్రెస్ ఆధ్వర్యంలో రైతు గర్జన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కె.బాబురావు చెప్పారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆ రోజు ఉదయం 10 గంటలకు రాజ్‌విహార్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

రేపు కళాకారులకు దుస్తుల పంపిణీ

కర్నూలు కల్చరల్: దీపావళి పండుగను పురస్కరించుకొని కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా కళాకారులకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి బైలుప్పల షఫివుల్లా తెలిపారు. మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఈనెల 6వ తేదీ ఉదయం 11 గంటలకు దుస్తుల పంపిణీ ఉంటుందని పేర్కొన్నారు.

టన్నెల్ నిర్మాణ పనులపై ఆరా

కర్నూలు (న్యూటౌన్): నగర శివారులోని రింగ్ రోడ్డు సమీపంలో చెన్నై – సూరత్ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ చేపట్టిన టన్నెల్ నిర్మాణ పనులను జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తనిఖీ చేశారు. శనివారం టన్నెల్ నిర్మాణ పనులతో పాటు నిర్మాణంలో వినియోగిస్తున్న గ్రావెల్, ఎర్త్ మెటల్‌ను ఎక్కడికి తరలిస్తున్నారని మైనింగ్ అధికారులు ఆరా తీశారు. అనంతరం టన్నెల్ తవ్వకాలను ఆయన పరిశీలించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

కర్నూలు(అగ్రికల్చర్): నగర శివారులోని జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే సీ.బెళగల్‌కు చెందిన మధు భార్య వెంకటేశ్వరి (23), ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం కల్లూరు మండల పరిధిలోని పుసులూరులో ఓ శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి కర్నూలు వైపు వస్తుండగా మిస్టర్ ఇడ్లీ హోటల్ దగ్గర గుర్తు తెలియని ఐచర్ వాహనం బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో వెంకటేశ్వరి అక్కడికక్కడే మరణించగా, ఇద్దరు పిల్లలు, భర్తకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎస్ఐ గిరిబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతురాలు తెలంగాణ రాష్ట్రంలోని తన పుట్టినిల్లు పుల్లూరుకు వెళ్తుండగా ఈ ఘటన జరిగింది.

ఆధ్యాత్మికం

14 నుంచి కార్తీక మాస పూజలు

కర్నూలు కల్చరల్: ఓర్వకల్ మండలం నన్నూరు సమీపంలోని రాగమయూరిలో ఉన్న సరస్వతీ దేవాలయంలో ఈనెల 14 నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు కార్తీక మాస విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు విద్య సుందర సరస్వతీ పీఠం నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజు ప్రత్యేక పూజలతో పాటు అమావాస్య రోజున జ్వాలా తోరణం, దీపోత్సవం, 30వ తేదీన శివపార్వతుల కల్యాణోత్సవం జరుగుతుందని భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సమాచారం

ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై దృష్టి సారించండి

కర్నూలు(రాజ్‌విహార్): వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో కీలకమైన ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణపై దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత పంపిణీ సంస్థ కర్నూలు ఎస్ఈ (ఆపరేషన్స్) ఎం. ఉమాపతి సిబ్బందిని ఆదేశించారు. శనివారం స్థానిక కొత్త బస్టాండ్ సమీపంలోని విద్యుత్ భవన్‌లో ట్రాన్స్‌ఫార్మర్స్, అకౌంట్స్ విభాగాల అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విభాగాల వారీగా జరుగుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్పాట్ బిల్లింగ్ ప్రక్రియను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు లత, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ చిన్న రాఘవులు, ఏడీఈలు, ఏఏఓలు పాల్గొన్నారు.

రోగులకు దారి చూపేందుకు వలంటీర్లు

- బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియామకం


ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వలంటీర్లను పరిచయం చేస్తున్న బుట్టా ఫౌండేషన్ అధ్యక్షురాలు బుట్టా రేణుక

కర్నూలు(హాస్పిటల్): వివిధ వ్యాధుల బారిన పడిన వారు ఎంతో దూరప్రాంతాల నుంచి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వస్తుంటారు. అలాంటి వారికి సువిశాలమైన ఆసుపత్రిలో ఏ విభాగం ఎక్కడ ఉందో, ఏ పరీక్షకు ఎక్కడకు వెళ్లాలో అర్థం గాని పరిస్థితి. అక్కడే విధులు నిర్వహించే వారు సైతం కొన్నిసార్లు ఠక్కున ఫలానా విభాగం ఎక్కడుందంటే చెప్పలేని వైనం. ఇలాంటి పరిస్థితుల్లో రోగులకు, వారి సహాయకులకు మేమున్నామంటూ బుట్టా ఫౌండేషన్ వారు ముందుకు వచ్చారు. రోగులకు, వారి సహాయకులకు ఆయా విభాగాలకు దారి చూపేందుకు గాను నలుగురు వలంటీర్లను నియమించారు. శనివారం విధుల్లో చేరిన ఆ వలంటీర్లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డికి బుట్టా ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, మాజీ ఎంపీ బుట్టా రేణుక పరిచయం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ వలంటీర్లు ఆసుపత్రికి వచ్చిన రోగులు, వారి సహాయకులకు దారి చూపిస్తారన్నారు. అవసరమైతే దగ్గరుండి ఆయా విభాగాలకు వారిని తీసుకెళ్తారని చెప్పారు. వలంటీర్ల ఏర్పాటు ద్వారా రాయలసీమ వాసిగా ఈ ప్రాంత ప్రజలకు కొంతైనా తాను సేవ చేయగలిగిన దానివతానని మాజీ ఎంపీ పేర్కొన్నారు.

భిన్న సాహిత్య రచనా ప్రక్రియ కర్త అజీజ్


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ సాయిగోపాల్, సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: భిన్న సాహిత్య రచనా ప్రక్రియ కర్త ఎస్.డి.వి. అజీజ్ అని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. ఇంటెలెక్చువల్స్ కలెక్టివ్ ఆధ్వర్యంలో శనివారం కేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రముఖ రచయిత ఎస్‌డీవీ అజీజ్ రచించిన 'చారిత్రక గాథలు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ మాట్లాడుతూ గత చరిత్ర జ్ఞాపకాలను తవ్వితీస్తూ పాఠకులలో ఆసక్తి కరంగా చదివేలా అజీజ్ రచనలు చేయడం జిల్లాకు గర్వకారణమన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.దేవికారాణి, అధ్యాపకులు డాక్టర్ ఎం. ఫమిదా బేగం, డాక్టర్ ప్రసాద్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కల మిట్ట శ్రీనివాసులు మాట్లాడారు. రచయితలు, కవులు దేవేంద్రాచారి, జహీర్ అహ్మద్, సుల్తాన్, సంస్థ అధ్యక్షులు ఖదీరుల్లా, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ సరెండర్

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ విభాగంలో డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ గఫార్‌ను నగరపాలక కమిషనర్ భార్గవ తేజ ప్రభుత్వానికి సరెండర్ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం, స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో వైఫల్యం కారణంగా అతనిని ఆరోగ్య శాఖ కార్యాలయానికి సరెండర్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆయన స్థానంలో మరొకరిని నియమించాలని కమిషనర్ ప్రభుత్వానికి విన్నవించారు.

ఫుడ్ కోర్టుకు రూ.60 వేలు జరిమానా...

నగరంలోని మౌర్యా ఇన్ ప్రాంగణంలో ఉన్న ఫుడ్ కోర్టుకు రూ.60 వేలు జరిమానా విధించారు. గత నెలలో విజిలెన్స్ అధికారులు ఆ హోటల్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ప్రజా ఫిర్యాదుల నేపథ్యంలో ఆహార పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు. నాణ్యత లేని నూనెలను వాడుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఆ నూనెను సీజ్ చేసి పరీక్షలకు పంపించారు. నాణ్యత లేదని తేలడంతో ఆ హోటల్‌కు రూ.60 వేలు జరిమానా విధించినట్లు విజిలెన్స్ అధికారులు వెల్లడించారు.

స్పోర్ట్స్

క్రీడాకారులకు కిట్ల పంపిణీ

కర్నూలు (టౌన్) : నగరంలోని స్థానిక వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ మాణిక్, అధ్యక్షుడు డాక్టర్ పి. వాసురెడ్డి శనివారం క్రీడాకారులకు తైక్వాండో కిట్లు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్ననాటి నుంచే మార్షల్‌ఆర్ట్స్ శిక్షణ తీసుకుంటున్న చిన్నారులను, ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందిస్తున్నానన్నారు. శిక్షణతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో తైక్వాండో శిక్షకులు టి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణించాలి

కర్నూలు (టౌన్) : తైక్వాండో క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా హాస్టల్ తైక్వాండో కోచ్ కె. కార్తికేయన్ ఆకాంక్షించారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో పతకాలు సాధించిన క్రీడాకారులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మరక్షణకు తైక్వాండో వంటి మార్షల్‌ఆర్ట్స్ ఎంతో అవసరమన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి పతకాలు సాధించిన రాధిక, సుగంధిని (బంగారు) పవన్, రేవంత్ (బంగారు) ఈనెల 9 నుంచి11 వ తేదీ వరకు కడప జిల్లా రైల్వే కోడూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగే రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో తైక్వాండో కోచ్ షబ్బీర్ హుస్సేన్, సీనియర్ క్రీడాకారుడు కపిల్ పాల్గొన్నారు.

అవినీతికి తావివ్వొద్దు


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, సిబ్బంది

కర్నూలు (అగ్రికల్చర్): ప్రతి ఒక్కరూ నీతి, నిజాయితీలను, నైతిక విలువలను పెంపొందించుకోవాలని వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి అక్బర్ బాషా తెలిపారు. శనివారం కర్నూలు రేడియోస్టేషన్ సమీపంలోని అపార్డ్ సంస్థ కార్యాలయంలో విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలను పురస్కరించుకుని జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అపార్డ్ సీఈఓ తిరుపాల్‌రెడ్డి మాట్లాడుతూ బ్యాంకింగ్ వ్యవహారాలతో పాటు అన్ని కార్యక్రమాల్లో పారదర్శకతను పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ నిజాయితీకి ప్రాధాన్యతనివ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అపార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

అవినీతికి వ్యతిరేకంగా పనిచేయాలి

కర్నూలు (టౌన్) : అవినీతికి వ్యతిరేకంగా ప్రతి పౌరుడు పనిచేయాలని అవినీతి నిరోధక శాఖ ఇన్‌స్పెక్టర్ తేజేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక సిల్వర్‌జూబ్లీ కళాశాల సమావేశ హాలులో అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఈ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్‌రెడ్డి, ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు కృష్ణయ్య, ఇంతియాజ్, మహబూబ్ బాషా పాల్గొన్నారు.

8న వ్యర్థాల సేకరణకు వేలం

కర్నూలు (టౌన్): ఈనెల 8 వ తేదీ ఉదయం 11 గంటలకు నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలులో వ్యర్థాల సేకరణకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న చికెన్, మటన్, చేపల వ్యర్థాలు అక్కడే వదిలేస్తున్నారని, వాటిని సేకరించేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కర్నూలు అసెంబ్లీ పరిధిలో వ్యర్థాల సేకరణకు రూ. 1.35 లక్షలు, పాణ్యం, కోడుమూరు అసెంబ్లీల పరిధిలో రూ.95 వేలు ధరావత్తు నిర్ణయించినట్లు తెలిపారు. వేలంలో ఎవరు ఎక్కువ పాడితే వారికి కేటాయిస్తామని తెలిపారు. వేలంలో పాల్గొనే వ్యక్తి దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ బుక్, పాన్ కార్డు, నివాస ధ్రువీకరణ పత్రం సమర్పించాలని తెలిపారు. వివరాలకు నగరపాలక సంస్థ కార్యాలయ పని వేళల్లో ఆరోగ్యాధికారి, సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు.

చేపలు, రొయ్యల్లో పోషకాలు మెండు

- శాంతిరామ్ మెడికల్ కాలేజీ న్యూట్రీషిన్ డాక్టర్ ఎం.కృష్ణారావు




సీ ఫుడ్ ఫెస్టివల్‌లో చేపలు,రొయ్యలను పరిశీలిస్తున్న విద్యార్థులు, మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ వెంకటేశ్వరరావు

కర్నూలు(అగ్రికల్చర్): చేపలు, రొయ్యలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదని, వాటిలో అధిక పోషకాలు ఉంటాయని శాంతిరామ్ మెడికల్ కాలేజీ న్యూట్రీషన్ డాక్టర్ ఎం.కృష్ణారావు అన్నారు. నగర పరిధిలోని రావూరీ గార్డెన్‌లో నిర్వహిస్తున్న ప్రాన్స్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ రెండవ రోజు కూడా విజయవంతం అయింది. విద్యార్థులు, మత్స్య సహకార సంఘాల సభ్యులు, ఇతరులు సీ ఫుడ్ ఫెస్టివల్‌కు పోటెత్తారు. సిల్వర్‌జూబ్లీ కళాశాల, కేవీఆర్ కళాశాల విద్యార్థి, విద్యార్థినులు సందర్శించారు. చేపలు, రొయ్యలు ఆహారంగా తీసుకోవడం వల్ల కలిగే ఉపయోగాలపై డాక్టర్ ఎం.కృష్ణారావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. నెలలో కనీసం రెండుసార్లు చేపలు లేదా రొయ్యలను విధిగా తీసుకోవాలని సూచించారు. చేపలు, రొయ్యలు, పీతల సాగులో ఉపాధి అవకాశాలు, ఎంటర్‌ప్రెన్యూర్‌పై మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు అవగాహన కల్పించారు. జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్యామల మాట్లాడుతూ... జిల్లా యంత్రాంగం సంపూర్ణంగా సహకరించడం వల్ల కర్నూలులో సీ ఫుడ్ ఫెస్టివల్ విజయవంతంగా జరుగుతోందని తెలిపారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం ఉంటుందని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా మత్స్యశాఖ అధికారి రాఘవరెడ్డి, వైఎస్ఆర్ జిల్లా మత్స్యశాఖ అధికారి నాగలింగచారి, అనంతపురం, సత్యసాయి జిల్లాల అధికారి చంద్రశేఖర్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా మత్స్యశాఖ అధికారి సుస్మిత, భూమి ఆర్గానిక్ (నాలెడ్జ్ పాట్నర్) ఎండీ రఘురామ్ పాల్గొన్నారు.